క్లుప్తంగా

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

రామసముద్రం: రామసముద్రం వ్యవసాయాధికారి కార్యాలయంలో బుధవారం పంటకోత ప్రయోగాలపై రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి ఏఎస్‌ఓ జగన్నాథం, వ్యవసాయాధికారి మోహన్‌కుమార్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన సర్వే నెంబర్లలో ఐదుఇన్‌టు ఐదు మీటర్లలో ఎంతదిగుబడి వస్తుందో అంచనా వేలయాలన్నారు. మండలంలో వేరుశనగ , రాగి, ఉలవలలో ఈ ప్రయోగాలు నిర్వహించాలన్నారు.

పెద్దతిప్పసముద్రం: మండలంలోని ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో పంట కోట ప్రయోగాలపై అవగాహన కల్పించారు. పంటల సాగు, ఏఏ పంటలకు ప్రయోగాలు నిర్వహించాలి, రైతుల వివరాలను ప్రభుత్వ యాప్‌లో నమోదు చేసే విధానం, ఇన్సూరెన్స్,స్థూల దేశీయోత్పత్తి గణనకు వ్యవసాయ రంగం యొక్క ప్రాముఖ్యత, ప్రతిబింబించే విధానం, వీటన్నింటి ప్రయోజనాలను ఏవో ప్రేమలత, ఏఎస్‌వో అశ్వినీలు క్షుణంగా వివరించారు.

రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ

వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచారు. ఈనెల 08 తేదీన కర్నూలు జిల్లా గార్గేయపురంలో రాష్ట్ర స్థాయి స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో చింతపర్తి పాఠశాలకు చెందిన నిహారిక రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం, సుదర్శన్, భవ్య, మధురితలు తృతీయ స్థాయిలో నిలిచి సత్తా చాటుకొన్నారు. బుధవారం స్థానిక పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వారిని అభినందించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ రెడ్డెప్పరెడ్డి, ఉపాధ్యాయునిలు లలితకుమారి, సువర్ణ పాల్గొన్నారు.

యూనియన్ నుంచి బహిష్కరణ

మదనపల్లె సిటీ: వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్‌కు వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడినవారిని యూనియన్ నుంచి బహిష్కరించినట్లు ఆ యూనియన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సి.నాగరాజ, ఎస్.వేమారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వి.ఆనందరెడ్డి, డి.రామలింగారెడ్డి, జీ.రామలింగారెడ్డి, బి.ఎర్రంరెడ్డి, జగదీష్‌రెడ్డి, కె.మనోహర్‌రెడ్డిలను యూనియన్ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, పే విజన్ విషయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనడంపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

కురబలకోట: రాష్ట్రంలో ఉనికి కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ పెద్దలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఆ పార్టీ తంబళ్లపల్లె నియోజక వర్గ కన్వీనర్ బాలిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం అంగళ్లులో జరిగిన నియోజక వర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో నియోజక వర్గ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ వాదులు ఎక్కడున్నా తిరిగి పార్టీలో చురుగ్గా వ్యవహరించాలన్నారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు

పీలేరు రూరల్ : పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు అందుబాటులో ఉంచినట్లు తిరుపతి తపాలాశాఖ ఎస్ఎస్‌పీ మహమ్మద్ జాఫర్ సాధిక్ తెలిపారు. బుధవారం స్థానిక పోస్టాఫీసు వద్ద జాతీయ జెండాలు ప్రదర్శించి అమ్మకాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవానికి అవసరమగు జాతీయ జెండాలు రూ. 25తో అందిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి డివిజన్‌లో 72 వేలు జెండాలు విక్రయించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్స్‌పెక్టర్ విజయబాస్కర్, పోస్ట్ మాస్టర్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

నిమ్మనపల్లె : గర్భిణులు వైద్యపరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబు, గైనకాలజిస్ట్ దీక్షితరాణి అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా వైద్యపరీక్షలు నిర్వహించారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సురక్షిత ప్రసవం

పీలేరు రూరల్ : ప్రభుత్వ ఆస్పత్రిలో సురక్షిత ప్రసవం సాధ్యమని వైద్యాధికారి డాక్టర్ సతీష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రేగళ్లు పీహెచ్‌సీలో ప్రధాన సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు రక్తహీనతకు గురి కాకుండా సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కాన్పుకు ముందుగా విధిగా వైద్య పరీక్షలు చేపించుకోవాలని కోరారు. గర్భిణులకు పరీక్షలు నిర్వహించి కాల్షియం విటమిన్ మాత్రలు పంపిణీ చేశారు.

డిమాండ్లు పరిష్కరించాలి

మదనపల్లె : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల 12 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బుధవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళుతున్నట్లు విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ప్రకటించింది. స్థానిక ఏపీఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్‌శాఖ ఉద్యోగ జేఏసీ చైర్మన్ జాఫర్‌వలీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.

సమరయోధుల త్యాగాలు మరువలేనివి

- ఘనంగా నా భూమి – నాదేశం కార్యక్రమం
- శిలాఫలకాలు, ప్రతిజ్ఞ, సన్మానాలతో వేడుకలు





మదనపల్లె: నాభూమి-నాదేశం కార్యక్రమంలో సర్పంచ్ ఆనందరెడ్డి తదితరులు, కలకడ: మొక్కల సంరక్షణ కోసం ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మదనపల్లె : స్వాతంత్ర్య సమర సమయంలో దేశ సమగ్రతను కాపాడేందుకు సైనికులు చేసిన త్యాగాలు మరువలేనివని డీఎల్‌పీఓ నాగరాజు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆగస్టు 9 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న నాభూమి–నాదేశం, నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమాన్ని మొదటిరోజైన బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. మండలంలోని కోళ్లబైలు, వైఎస్సార్ కాలనీ, చీకలబైలు, వేంపల్లె, కొత్తపల్లె, ఈశ్వరమ్మకాలనీ, కొత్త ఇండ్లు గ్రామ పంచాయతీల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో శిలాఫలకాలను ఏర్పాటుచేసి జాతికి అంకితమిచ్చారు. వసుధకు వందనంలో భాగంగా మొక్కలను నాటారు. కొత్తపల్లె, కొత్త ఇండ్లు గ్రామ పంచాయతీల్లో మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. శిలాఫలకం దగ్గర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, ఏపీఓ సుబ్రహ్మణ్యం, సర్పంచులు ఆనందరెడ్డి, ఆసియాబేగం, బండిమనోహర్, ఆదెమ్మ, ఎంపీటీసీలు రెడ్డెమ్మ, అమీరున్నీసా, వైస్ సర్పంచ్ విజయలక్ష్మి, మాజీ కోఆప్షన్ ఇస్మాయిల్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు : మండలంలోని దొడ్డిపల్లె, బాలంవారిపల్లె, కాకులారంపల్లె, అగ్రహారం, యర్రగుంట్లపల్లెలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆయా గ్రామ సచివాలయాల వద్ద శిలాఫలకం ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎంతో మంది అమరవీరుల పోరాట ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు. అమరవీరులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీమోహన్‌రెడ్డి, ఏపీవో మహేశ్వర్, నాయకలు నారే వెంకటరమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లవోలులో..

కలికిరి: మండలంలోని పల్లవోలు గ్రామం పల్లవోలు కస్బాలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం నాభూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ గంగయ్య ఆధ్వర్యంలో సర్పంచ్ బీబీ ఆయేషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామంలో శిలాఫలకం ఏర్పాటు చేసి, త్రివిధ దళాలల్లో విధులు నిర్వహించిన వారిని, వారి కుటుంబ సభ్యులు, సీనియర్ సిటిజన్‌లను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఐటీబీపీ అధికారులు, జవాన్‌లు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ జుబేర్‌అహ్మద్, ఏపీఓ సుజాత, ఇస్తియాక్ అహ్మద్, కార్యదర్శి రెడ్డిప్రసాద్, శంకర, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేత తల్లిని కాపాడుకుందాం

కలకడ : నా భూమి–నా దేశాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపైన ఉందని ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు హారిక, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కోన పంచాయతీలో ఏర్పాటు చేసిన నాభూమి–నాదేశం కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. కోన పంచాయతీలోని వీర జవాన్లు రామచంద్రారెడ్డి, ఖాదర్‌వలిల ఆత్మశాంతికోసం 5నిమిషాల మౌనం పాటించారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత విద్యార్థి దశనుంచి, వయస్సుతో నిమిత్తం లేకుండ మొక్కల పెంపకంపై శ్రద్ధ పెట్టాలని కోరారు. కోన ప్రభుత్వ ఉన్నతపాఠశాల లో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితురాలు సరళ, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, హరినాధరెడ్డి, మాదవరెడ్డి, ఆపాఠశాల కమిటీ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ఏపీఓ సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురబలకోటలో..

కురబలకోట: నా భూమి నాదేశం ఆజాద్‌కా అమృత్ మహోత్సవంలో భాగంగా బుధవారం కురబలకోట, అంగళ్లు, కడప క్రాస్‌లో కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, తహశీల్దారు ఎం. భీమేశ్వరావు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులను,అమర వీరుల త్యాగాన్ని స్మరిస్తూ శిలాఫలకం ఆవిష్కరించారు. నేలతల్లికి వందనం నినాదంతో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ సుక్కా సుజాత, ఎంపీడీఓ దిలీప్‌కుమార్, ఎపీఓ వెంకటేష్, యాసాన్, ఎస్. సుధాకర్, శెట్టి భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వసుధకు వందనం విజయవంతం చేయాలి

రామసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వసుధకు వందనం కార్యక్రమం విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీడీవో నారాయణస్వామిలు తెలిపారు. బుధవారం కుదురుచీమనపల్లి, మూగవాడి, మాలేనత్తం , చొక్కాండ్లపల్లి , రాగిమాకులపల్లె , మినికి పంచాయతీలో వసుధకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నామట్టి నాదేశం నేలతల్లికి నమస్కారం , వీరులకు వందనం , శిలాఫలకం ఆవిష్కరణలు , ప్రతి గ్రామ పంచాయతీలలో 75 మొక్కలు నాటి వాటిని సంరక్షించుకునే విధంగా ప్రతి పంచాయతీలోను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, ఏపీవో గౌరిశంకర్, అధికారులు పాల్గొన్నారు.

వీర జవాన్ల సేవలు స్ఫూర్తిదాయకం

వాల్మీకిపురం: వీర జవాన్ల సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని జెడ్పీటీసీ నిర్మల, ఎంపీడీవో షబ్బీర్‌అహ్మద్ అన్నారు. బుధవారం మండలంలోని వాల్మీకిపురం, చింతలవారిపల్లె, చింతపర్తి, గండబోయన పల్లె, మూరేవాండ్లపల్లె, నగరిమడుగు సచివాలయాల పరిధిలో ఆజాదీకా అమృత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా నాభూమి–నాదేశం నేల తల్లికి నమస్కారం, వీరులకు వందన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. మాజీ సైనికోద్యోగులు మదన్‌మోహన్‌రెడ్డి, రవిచంద్ర, దివంగత సలాది నారాయణ సతీమణీలను సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగులమ్మ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్, ఉపసర్పంచ్ కేశవరెడ్డి, ఆర్బీకే ఛైర్మెన్ నీళ్లభాస్కర్, సింగిల్‌విండో అధ్యక్షులు శ్రీధర్ రాయల్, వైస్ ఎంపీపీలు డాక్టర్ వెంకట్రమణ, కిరణ్ కుమార్, రాయుడు, ఈవో ఉదయ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం

కేవీపల్లె : ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నేలతల్లికి నమస్కారం... వీరులకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బుధవారం కేవీపల్లెలో నా భూమి – నా దేశం శిలాఫలకం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి చేతుల మీదుగా మొక్కలు నాటారు. అలాగే మండలంలోని వగళ్లలోనూ ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ యల్లయ్య, ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

తంబళ్లపల్లె: మొక్కలు పెంచినప్పుడే పర్యావరణ పరిరక్షణ, మనుగడకు సాధ్యమవుతుందని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో బుధవారం ఆజాదీకా అమృత మహోత్సవాలు నిర్వహించారు. గోపిదిన్నె, ఎర్రసానిపల్లె, పంచాలమర్రి,పరసతోపు పంచాయతీలలో నా భూమి– నా దేశం శిలాఫలాలను ఆవిష్కరించారు. నేలతల్లికి నమస్కారం, వీరులవందనం,పంచప్రాణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. మొక్కల పెంపకంతో జరిగే ఫలితాలు వివరించారు. కార్యక్రమాల్లో సర్పంచులు సుదాకర్‌రెడ్డి, సుగుణమ్మ, పార్వతమ్మ, నాగేంద్రబాబు, ఏపీఓ అంజనప్ప, ఉపాధి ఇంజనీర్ రామన్న, పంచాయతీ కార్యదర్శులు రఘు, సోమశేఖర్, నాయకులు భద్ర, కరీముల్లాలు పాల్గొన్నారు.

ప్రతిగ్రామంలో నా మట్టి–నా దేశం

బి.కొత్తకోట: దేశకోసం మరచిపోని సేవలందించిన వారిని స్మరించుకొంటూ బుధవారం మండలంలోని బయ్యప్పగారిపల్లె, శీలంవారిపల్లె, గోళ్లపల్లె, బండారువారిపల్లె పంచాయతీల్లో నా మట్టి–నా దేశం కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు. ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్రలు పంచాయతీల్లో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రెండవ ప్రపంచ యుద్ధంలో సైనికునిగా సేవలు అందించిన బండారువారిపల్లె పంచాయతి చిటిమిరెడ్డిగారిపల్లెకు చెందిన వనమా వెంకటరెడ్డి చనిపోగా ఆయన భార్య శివమ్మను సత్కరించి ఆమె చేత మొక్కను నాటించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ గురించి వివరిస్తూ శిలాఫలకాలను ఆవిష్కరించారు. గ్రామస్తులతో పంచ్‌ప్రాణ ప్రతిజ్ఞ, భూమికి వందనంలో భాగంగా ప్రతి గ్రామంలో 75 మొక్కలను నాటారు. గ్రామాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు భీమిగాని నాగిరెడ్డి, ఉజ్జయిని సాంబశివ, పుష్పలత, లక్ష్మీదేవి, మాజీ ఎంపీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఏపీఓ మంజుల పాల్గొన్నారు.



పీలేరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి



కలికిరి: పల్లవోలులో..



కురబలకోటలో...











రామసముద్రం : కెసి.పల్లిలో వసుధకు వందనం, తంబళ్లపల్లె: శిలాఫలకం ఆవిష్కరణ, వాల్మీకిపురం: వీరజవాన్లకు సన్మానం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, కేవీపల్లె : ఆజాదికా అమృత్ మహోత్సవ్ , బి.కొత్తకోట: మొక్కలు నాటుతున్న అధికారులు, సర్పంచ్

నాడు – నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలి

– డీఈఓ ఎస్. పురుషోత్తం



మాట్లాడుతన్న డీఈఓ పురుషోత్తం

పీలేరు రూరల్ : రెండో విడత నాడు – నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలని డీఈఓ ఎస్. పురుషోత్తం అన్నారు. బుధవారం స్థానిక భువన విద్యాలయంలో నియోజకవర్గ స్థాయి ఎంఈవోలు, హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడతలో రూ. 349 కోట్లతో జిల్లాలో 1017 పాఠశాలల పనులు, 21 కళాశాలల పనులు జరుగుతున్నట్లు తెలిపారు. అదనపు భవనాలు, మరుగుదొడ్ల పనులు జరుగుత్నుట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ. 116 కోట్లు మంజూరు కాగా, రూ. 106 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 70 శాతం పనులు పూర్తైనట్లు తెలిపారు. ఈ నెలాఖరు లోపు వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది జిల్లాలో 2.56 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని, ఈ నెలాఖరు వరకు అడ్మీషన్లు గడువు వుందని తెలిపారు. కార్యక్రమంలో డీవైఈవో ఆనంద్‌రెడ్డి, సీఎంవో కరుణాకర్, ఏఎస్ఎల్‌వో కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌నాయక్, ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, మరీముల్లా, వెంకటలక్ష్మీ, మునీంద్రనాయక్, సుబ్రమణ్యం, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయతీ నల్లంవారిపల్లె, పిల్లగోవులపల్లె, దేవిరెడ్డిగారిపల్లె, మన్యంవారిపల్లె, సింగంవారిపల్లె, పత్రిగుట్ట గ్రామాల్లో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ శ్రీవాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో పాటుగా ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆర్.ఐ.రమణారెడ్డి, సచివాలయ కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు ఇంటింటికీ వెళ్లి లబ్దిదారులను పలుకరించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందించారు. వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల కాలంలో ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాల లబ్దిని వివరించారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ పెరుగుతుంటే చంద్రబాబు ఓర్వలేక పోతున్నారన్నారు. ప్రాజెక్టుల పేరుతో ప్రతిపక్షనేత చంద్రబాబు చేపట్టిన పర్యటన ఒక బూటకమని, కావాలనే అంగళ్లు, పుంగనూరుల్లో అమాయక ప్రజలు, టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులపై, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేయించారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల,మత,పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పథకాలు అందుతుంటే.. టీడీపీ పాలనలో కేవలం తెలుగుతమ్ముళ్లు మాత్రమే లబ్ధి పొందారని గుర్తుచేశారు. సర్పంచులు సుబ్రహ్మణ్యం, మహదేవ రెడ్డి, చంద్రాయుడు, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ, నాయకులు నవీన్, యుగంధరరెడ్డి, శ్రీనివాసులుశెట్టి, మహేష్, దూకుడువెంకటరమణ, రఘు, తహసీల్దార్ సీ.ఆర్.మంజుల, ఎంపీడీఓ శేషగిరిరావు, ఎస్‌ఐ రామకృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా ఆడికృత్తిక ఉత్సవాలు



ఆడికృత్తిక ఉత్సవాల్లో స్వామివారి ఊరేగింపు

వాల్మీకిపురం: పట్టణ సమీపంలోని శ్రీకార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. బుధవారం స్థానిక ఆలయంలో వేకువజామునే స్వామివార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈసందర్భంగా వల్లిదేవత సమేత శ్రీసుబ్రమణ్యస్వామివారి కావిడ్లతో మేళతాళాలతో పట్టణంలో ఊరేగించారు. అనంతరం స్వామివార్లకు ఊంజల్ సేవ, కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలోని సుబ్రమణ్యస్వామి ఆలయాలు భక్తుల హరో హర నామస్మరణలతో మారుమోగాయి. ఆడికృత్తిక సందర్భంగా బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక దేవళం వీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలోని బాల సుబ్రమణ్యంకు అర్చకులు ఫణికుమార్‌శర్మ ప్రత్యేక అలంకణ చేసి అభిషేకాలు, పూజలు చేశారు. శ్రీ వల్లిదేవసేనసమేత సుబ్రమణ్యస్వామికి ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు.

జీడీఎస్ ధర్నాను విజయవంతం చేయండి

పెద్దతిప్పసముద్రం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణికి నిరసనగా ఈ నెల 10న చిత్తూరు తపాలా శాఖ డివిజనల్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని మదనపల్లి బ్రాంచి జీడీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అమరనాథ్‌రెడ్డి, సెక్రటరీ శివప్రసాద్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని గతంలో పలుమార్లు నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తే కేంద్ర ప్రభుత్వం కేవలం చర్చలతోనే సరిపెట్టుకొంటోందని ఆరోపించారు. ఎనిమిది గంటల పని, పింఛన్‌తో సహా ప్రయోజనాలను మంజూరు చేయాలని, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు.

వలంటీర్ మృతికి సంతాపం

పెద్దమండ్యం: అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన వలంటీర్‌కు పలువురు సంతాపం తెలిపారు. మండలంలోని బండ్రేవు గ్రామ సచివాలయం పరిధిలోని బోదగుంటపల్లెలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన శివప్రసాద్ (22) వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల తీవ్ర జ్వరంతో బాధపడుతూ స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. జ్వరం తగ్గక పోవడంతో మెరుగైన చికిత్సల కోసం కుటుంబ సభ్యులు తిరుపతికి తరలించారు. వారం రోజులుగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వైభవంగా శాంతి హోమం

రామసముద్రం: రామసముద్రం మండలం గుంతయంబాడి గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో బుధవారం వైభవంగా శ్రీదుర్గా సహిత పవమానహోమం నిర్వహించారు. అధిక శ్రావణ మాసం పురస్కరించుకొని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పీలేరు సమ్యలపై డీజీపీకి ఎమ్మెల్యే వినతి



డీజీపీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: పీలేరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కలసి వినతి పత్రం సమర్పించారు. బుధవారం విజయవాడలోని డీజీపీ కార్యాలయంకు వెళ్లి మర్యాద పూర్వకంగా ఆయన్ను కలిశారు. అనంతరం నియోజకవర్గం నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నియోజకవర్గంలోని వాల్మీకిపురంలో సబ్‌జైలు భవనం, అగ్నిమాపకేంద్ర భవన నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాల్మీకిపురంలో సర్కిల్ కార్యాలయానికి కొత్తభనం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసుల వాహనాల శిథిలావస్థకు చేరుకొన్నాయని వాటి స్థానంలో కొత్త వాహనాలు మంజూరు చేయాలన్నారు. పీలేరు పట్టణంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన డీజీపీ తర్వలోనే సమస్యలకు పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.

జగనన్న పాల వెల్లువ కేంద్రాలకు వసతులు

గుర్రంకొండ: మండలంలోని జగనన్న పాలవెల్లువ కేంద్రాలన్నింటికి ప్రభుత్వం తరఫున అన్ని వసతులు కల్పిస్తామని ఎంపీడీఓ వెంకటేశులు అన్నారు. బుధవారం మండలంలోని దౌలత్‌ఖాన్‌పల్లె, అమిలేపల్లె, తలారివాండ్లపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగనన్న పాలవెల్లువ కేంద్రాలను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న వసతులను పరిశీలించారు. ఈసందర్భంగా మండలంలో కొత్తగా 17 పాలవెల్లువ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని కేంద్రాల్లో కూడా యంత్రాలు, కంప్యూటర్లు, పాలుకొలిచే యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాలకు విద్యుత్ సౌకర్యంతో పాటు ఇతర వసతులు ఇప్పటికే కల్పించామన్నారు. తొందరలోనే ఈ కేంద్రాల్లో పాలసేకరణ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఏపీఎమ్ రమణ, నోడల్‌అధికారి దివ్యవాణి, పంచాయతీ కార్యదర్శులు విశ్వనాథ్, మణికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

పీలేరు : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో గిరిజన యానాది సేవాసంఘం, ఆర్‌జీఎస్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ గిరిజనులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజనుల సమస్యలపై స్పందించి అర్హులైనవారికి ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు, ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు జానం గంగిరెడ్డి, కిల్లా విజయ్‌కుమార్, కాలనీ చిన్న, కాటయ్య, గడ్డం శ్రీనివాసులు, రెడ్డెప్ప, ఈశ్వరయ్య, రమణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: ఆదివాసి పిల్లల హక్కులను కాపాడి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఫోర్డు ప్రతినిధి నరసింహులు కోరారు. బుధవారం స్థానిక గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు.

ప్రశాంతంగా ఉన్న జిల్లాలో కార్చిచ్చు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మదనపల్లె : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సుభిక్షంగా ఉన్నటువంటి జిల్లాలో ప్రశాంతతను భగ్నంచేసేలా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాజెక్టుల సందర్శన పేరుతో కార్చిచ్చు పెట్టి వెళ్లారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కౌన్సిలర్ ముబీనా, మేదరసంఘం డైరెక్టర్ తాలేసుజాత, నాయకులు సలీం, సుబ్రహ్మణ్యంలు మాట్లాడుతూ అంగళ్లు, పుంగనూరులో జరిగిన ఘటనలు దురదృష్టకరమన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్దేశపూర్వకంగా టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీస్ యంత్రాంగం, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు ఉసిగొల్పారన్నారు. టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి చేసిన అరాచకాలు, అకృత్యాలు రాష్ట్రప్రజలు గుర్తించారని, రానున్న ఎన్నికల్లో వీటికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ప్రజల్లో పూర్తిగా విశ్వాసం కోల్పోయిన టీడీపీ నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి కుటుంబసభ్యులపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, మంత్రి పెద్దిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు, అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మదనపల్లెలో టీడీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిపై చేసిన వ్యాఖ్యలు వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు.